

నేటి నుంచి ఎస్‌టి కమిషన్ సభ్యుని పర్యటన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఎపి షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు వదిత్య శంకర్ నాయక్ జిల్లాలో సోమవారం నుంచి మూడు రోజుల అధికార పర్యటనలో ఉంటారని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెఎన్.జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం బొమ్మూరులోని ఎపిహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులతో 10 గంటల వరకూ సమావేశం అవుతారని, అక్కడ నుంచి బయల్దేరి 10.15 గంటలకు కడియం మండలం వేమగిరి గ్రామానికి చేరుకుని ఎస్‌టిలతో సమావేశం అవుతారని తెలిపారు. అనంతరం కొవ్వూరు మండలం మద్దూరులో ఎస్‌టిలతో సమావేశం ఉంటుందన్నారు. మంగళవారం ప్రజలు, ప్రతినిధులు నుంచి అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్‌పితో సమావేశం అవుతారని, మధ్యాహ్నం 3 గంటలకి పత్రికా ప్రతినిధుల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

గోదారి చెంత.. తాగునీటి చింత..

- తాగునీటికి బోరు నీరే శరణ్యం
- కొవ్వూరు, నిడదవోలులో పట్టాలెక్కని ప్రాజెక్టులు
- దాహార్తిని తీర్చడంలో పాలకులు విఫలం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి చెంతనే ఉన్నా కొవ్వూరు, నిడదవోలు వాసులకు గొంతు తడవడం లేదు. గుక్కెడు నీళ్లకోసం దశాబ్దాలుగా కష్టాలు పడుతున్నా ప్రజల దాహార్తిని తీర్చడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. తాజాగా 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు గోదావరి నీటిని అందిస్తామంటూ కూటమి నేతలు హామీలు గుప్పించారు. ఈ ఎన్నికల్లో నిడదవోలు, కొవ్వూరులతో పాటు జిల్లావ్యాప్తంగా కూటమి నేతలు విజయ దుందుభి మోగించారు. నిడదవోలు కూటమి అభ్యర్థిగా గెలిచిన కందుల దుర్గేష్‌కు మంత్రివర్గంలోనూ చోటు దక్కింది. అధికారంలోకి వచ్చి 6 నెలలు గడుస్తున్నా నిడదవోలు, కొవ్వూరు పట్టణ వాసులకు గోదావరి నీటిని అందించే ఎఐఐబి ప్రాజెక్టు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఎఐఐబి) నిధులతో మంజూరైన రూ.128 కోట్ల ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేసి గోదావరి నీరందిస్తారో అని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

కొవ్వూరు పట్టణంలో ఎక్కిళ్లు

కొవ్వూరు పట్టణంలో 50 వేల మంది జనాభా ఉంది. నియోజకవర్గంలో వేల ఎకరాల సాగుభూమి ఉంది. గోదారి చెంతనే ఉన్నా తాగు, సాగునీటికి బోరు నీరే ఆధారం. ఎక్కడో 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాలకు గోదావరి నీరు అందిస్తామని పాలకులు హామీలు గుప్పిస్తుంటారు. కానీ గోదారి చెంతనే ఉన్న ప్రాంతాలకు నదీ జలాలను అందించేందుకు ఎందుకు శ్రద్ధ చూపరని ఇక్కడి వారు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం కొవ్వూరు ప్రజలకు పురపాలక సంఘం ప్రతిరోజూ రెండుపూటలా తాగునీటిని సరఫరా చేస్తోంది. కానీ ఈ నీరు మున్సిపల్ వాటర్‌వర్క్సులో ఏడు బోర్లను ఏర్పాటు చేసి ఒక్కొక్క పూటకూ 21 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. అయినా వేసవి వచ్చిందంటే పట్టణంలోని 22వ వార్డు పోతురాజు దిబ్బ, 15వ వార్డు బ్రిడ్జిపేట, ఒకటో వార్డు రాజీవ్ కాలనీ, ఆర్‌ఓటో టౌన్‌షిప్, అచ్యాయమ్మ కాలనీల్లో తాగునీటి ఎద్దడి తప్పడం లేదు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఎఐఐబి సహకారంతో రూ.58 కోట్లతో గోదావరి ఉపరితల జలాలను అందించేందుకు గతంలో ప్రణాళికలు రూపొందించారు. తొలి దశలో పైప్‌లైన్ పనులు చేపట్టాలని, రెండో దశలో గామన్‌బ్రిడ్జి సమీపంలో గోదావరి ఒడ్డున ఇన్‌టేక్ వెల్ నిర్మాణం, హెడ్‌వాటర్ వర్క్సు స్థలంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, పవర్‌హౌస్, బ్రిడ్జిపేట, అచ్యాయమ్మ కాలనీల్లో రిజర్వాయర్ ట్యాంకులను నిర్మిస్తామన్నారు. అయితే ఇప్పటికీ పూర్తి చేయకపోవటం పాలకుల చిత్తశుద్ధిని దర్పణం పడుతోంది.

నిడదవోలు పట్టణానికి బోరు నీరే దిక్కు

ఆ గోదావరి ఒడ్డునే ఆనుకుని ఉన్న ప్రాంతాల ప్రజలకు ఈ జలాలను తాగునీరుగా పొందే అవకాశం ఇప్పటికీ లేదంటే ఆశ్చర్యమే. నిడదవోలు పట్టణం అందులో ఒకటి. వీరికి తాగునీరుగా గోదావరి జలాలు అందకపోవడంతో నేటికీ బోరు నీరే శరణ్యం. దీన్ని అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మంజూరైన తాగునీటి ప్రాజెక్టు శిలాఫలకాల దశలోనే నిలిచిపోవడం ఇక్కడ ప్రజలకు శాపమే. నిడదవోలు 1964లో పురపాలక సంఘంగా అవతరించింది. గోదావరి కాలువను ఆనుకుని ఉన్న ఈ పట్టణ ప్రజానీకానికి పురపాలక సంఘం అందించే బోరు నీరే ఆధారం.



నిడదవోలు పురపాలక సంఘంగా ఏర్పడి ఇప్పటికి సుమారు 58 ఏళ్లవుతున్నా, గోదావరికి కూతవేటు దూరంలో ఉన్నా గోదావరి నీళ్లు తాగే భాగ్యం ఇప్పటివరకు వీరికి రాలేదు. ఇదంతా పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం. వాస్తవానికి గోదావరి జలాలను ప్రజలకు అందించాలనే లక్ష్యంగా ఒక బృహత్తర ప్రాజెక్టుకు గతంలోనే మొగ్గ తొడిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఎఐఐబి) నిధులు రూ.70.17 కోట్లతో గోదావరి జలాల ప్లాంటు, పైపులైన్లకు ప్రాజెక్టు మంజూరైంది 2019 ఫిబ్రవరి 9న వార్డు సంత ప్రదేశంలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 2021 జూలై 7న ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ గోదావరి జలాల పైపులైను నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ రెండు శిలాఫలకాలూ కనిపిస్తున్నాయి తప్ప పనుల్లో పురోగతి లేదు. ప్రజలు పురపాలక సంఘం ద్వారా అందించే బోరు నీరు వాడకపు నీటిగా ఉపయోగించుకుంటూ తాగునీటికి ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌పైనే ఆధారపడుతున్నారు.

మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేయాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం



సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టులు, అభ్యుదయ వాదులపై ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. సిపిఎం రాజమహేంద్రవరం నగర మహాసభ తాడితోటలోని రావణం శ్రీరాములు కళ్యాణ మండలంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కె.రామకృష్ణ, రామచంద్రరావు, తులసి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పాల్గొని మాట్లాడారు. మత విశ్వాసానికి - మూఢ నమ్మకాలకు గల వ్యత్యాసాన్ని ఆయన వివరించారు. రాష్ట్ర రాజకీయాల్లో ఒక ప్రమాదకర ధోరణి మొదలైందని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ తన విధానాలను అమలు చేస్తోందని తెలిపారు. ఫలితంగా యువత ఆలోచన విధానాలపై తీవ్ర ప్రభావం పడుతోందని అన్నారు. మనుధర్మశాస్త్రాన్ని చెప్పే నాయకులు దాన్ని ఆచరిస్తారా అని ఆయన ప్రశ్నించారు. ఈ మహాసభలో 11 తీర్మానాలను ప్రవేశ పెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ తీర్మానాల్లో సర్దుబాటు ఛార్జీలు ఉపసంహరించుకోవాలని, పేపరు మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేయటంతో పాటు పలు స్థానిక సమస్యలపై తీర్మానాలను ప్రవేశపెట్టారు. అనంతరం 13 మంది సభ్యులతో నూతన నగర కమిటీ ఎన్నికైంది. నగర కార్యదర్శిగా కర్రి రామకృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యులుగా బి.పవన్, బివి.పూర్ణిమ రాజు, జరీనా, సరోజ్, నగర కమిటీ సభ్యులుగా పి.మురళీకృష్ణ, ఎన్.వెంకటేశ్వర రావు, పడాల రామకష్ణ, ఎస్.మాచరరావు, టి.నాగమణి, వి.రాంబాబు. జెవి.రావు, ఎం.వెంకటలక్ష్మి ఎన్నికయ్యారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

ఉలికి పడిన వేట్లపాలెం..

-స్థలం వివాదంతో ప్రత్యర్థులపై దాడి

-ముగ్గురు హతం, పలువురుకి గాయాలు -ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - సామర్లకోట

కత్తులు, కర్రలతో ఒక్కసారిగా చేసిన దాడిలో ముగ్గురి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఆదివారం రాత్రి సామర్లకోట మండలం వేట్లపాలెంలో జరిగిన ఈ సంఘటన జిల్లాను ఉలికిపాటుకు గురిచేసింది. వేట్లపాలెం గ్రామ శివారులోని దళితపేటకు చెందిన చెరువును గ్రామానికి చెందిన కారదాల కుటుంబికులు ఆక్రమించి గృహాన్ని నిర్మిస్తున్నారని అదే గ్రామానికి చెందిన బచ్చల కుటుంబ సభ్యులు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదులు చేశారు. గత 3 నెలలుగా ఈ వివాదం రెండు కుటుంబాల మధ్య సాగుతోంది. ఆదివారం రాత్రి కారదాల కుటుంబ సభ్యులు ఇంటి నిర్మాణానికి సంబంధించి స్లాబ్ పనులు చేస్తుండగా బచ్చల కుటుంబానికి చెందిన వ్యక్తులు కత్తులు, కర్రలు, ఇనుప రాడ్లతో ఒక్కసారిగా కారదాల కుటుంబంపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో కారదాల ప్రకాశ రావు(45) అక్కడికక్కడే మృతి చెందాడు. కారదాల చంద్రరావు(60) సామర్లకోట ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. కారదాల యేసుబాబు(45) కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో దుర్మరణం చెందాడు. గాయపడిన కారదాల పండు, కారదాల దావీదు, కారదాల బాబి, కారదాల చిన్నోడు, కారదాల సత్యవేణి, కారదాల అచ్చయ్య, కారదాల సంజీవరావు చికిత్స పొందుతున్నారు.

అగ్నిప్రమాద బాధితునికి ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుని సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ఆదివారం పరమర్శించారు. స్థానిక 11వ డివిజన్ విఎల్ పురం స్కూల్ వీధిలో టైలర్ మల్లిబాబుకు చెందిన దుకాణం షార్ట్ షర్క్యూట్ కారణంగా దగ్ధం అయ్యింది. విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధితునికి ప్రభుత్వ పరంగా నష్ట పరిహారం వచ్చేలా చూస్తామన్నారు.



అగ్నిప్రమాద బాధితుని పరామర్శిస్తున్న ఎంఎల్‌ఎ

వినియోగదారుల నమ్మకంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-తాళ్లపూడి

నూతన వ్యాపార సంస్థలు అభివృద్ధిలోకి రావాలంటే అది వినియోగదారుల నమ్మకంతోనే సాధ్యమని ఈ విధంగా నూతన యాజమాన్యాలు జాగ్రత్త తీసుకోవాలని ప్రముఖ వ్యాపారవేత్త ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు సింహాద్రి జనార్ధన్‌రావు, గ్రామ మాజీ సర్పంచ్ టిడిపి నాయకులు నామన పరమేశ్వరరావు అన్నారు. తాళ్లపూడిలో హిందుస్థాన్ పెట్రోలియం సంస్థకు చెందిన మామిడీస్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన సింహాద్రి, నామన ఆదివారం పెట్రోల్ బంకును ప్రారంభించారు. మొదటగా జనార్ధనరావు కొనుగోలు చేశారు. బంక్ యజమానులు మామిడి వెంకటప్రణయ్, అప్పాజీ, దుర్గాప్రసాద్ తాళ్లపూడిలోనే సుమారు 100 మంది ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికీ రూ.లక్ష విలువైన బీమా పాలసీలుఉచితంగా అందజేశారు. ఉప్పులూరి రమేష్, మద్దుకూరి శంకరం, కంకిపాటి శ్రీను, సిద్ధంశెట్టి కృష్ణ, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, వంబోలు పోసిబాబు, వనిమిరెడ్డి శ్రీను, గోలి అన్నవరం హాజరయ్యారు.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్


ప్రజా సమస్యల పరిష్కార వేదిక పిజిఆర్‌ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా నిర్వహిస్తున్నటు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్లో, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

చివటంలో శిథిలావస్థకు చేరుకున్న పుంతలో ముసలమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన గమిడి భాస్కరరావు కుటుంబ సభ్యులు గమిడి రామ నాగేశ్వరరావు, వెంకట సీతాసుగుణ, శ్రీను, శ్యామల, చలంచర్ల శ్రీనివాసు, దేవి దంపతులు శంకుస్థాపన, విగ్రహావిష్కరణ కోసం అందజేసిన సుమారు రూ.3 లక్షల సాయంతో ఆలయ నిర్మాణం ప్రారంభించారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కారణంగా, రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం శిథిలావస్థకు చేరుకున్న దేవాలయాన్ని తొలగించి, నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.25 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వేముల వెంకట సత్యనారాయణ, చిలుకూరి శ్రీనివాస్, కూనపరెడ్డి రంగా, గంటిన వెంకన్న, దాసరి మునీశ్వరావ్, అబ్బిరెడ్డి శివ సతీష్, కొండదాసు ఫణి దినేష్, ఎం.మురళీకృష్ణ, సాలాపు వెంకటేష్, మడిపల్లి రిషి, ఎన్.వీర్రాజు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రత్యేక తెలుగు రాష్ట్రం ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పలుచోట్ల ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం రూరల్ కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని చేపట్టి ఘన నివాళి అర్పించినట్టు తెలిపారు. తెలుగు భాష మాట్లాడే వారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ దీక్ష చేపట్టి, రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్పవ్యక్తి అన్నారు. లక్ష్య సాధనలో ప్రాణాలు అర్పించిన అటువంటి నాయకుల నుంచి స్ఫూర్తి పొందాలని జెసి పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఒ ఎల్.అప్పలకొండ, జిల్లా బిసి సంక్షేమ అధికారి కెఎన్.జ్యోతి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ టి.రాధిక, కలక్టరేట్ ఎఒ ఆలీ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోటగుమ్మం వద్ద గల జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిఇఒ కంది వాసుదేవరావు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం వాసుదేవరావు మాట్లాడుతూ.. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, బాషా ప్రాధాన్యాన్ని అనుసరించి రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరగలేదన్నారు. మద్రాస్ రాష్ట్రంలో తెలుగు మాట్లాడే ప్రజలు ఎదుర్కొంటున్న అన్యాయాన్ని సరి చేయాలని 1952 అక్టోబర్ 19న నిరాహార దీక్ష ప్రారంభించిన అయన దాదాపు 58 రోజులు చేసి డిసెంబర్ 15న ప్రాణాలు వదిలారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఎడిలు వెంకట్రాజు, ఛాయాదేవి, సూపరింటెండెంట్ రాజకుమారి, అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్ కుమార్, సిబ్బంది రాధాకుమారి, సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయంలో డాక్టర్ కె.వెంకటేశ్వరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 56 రోజుల నిరాహార దీక్షతో ప్రత్యేక తెలుగు భాష రాష్ట్రం సాధించారని, వయన పట్టుదల, త్యాగనిరతి మరువరానిదని ప్రతిఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్స్ కెవి.సత్యనారాయణ, స్టాలిన్, డాక్టర్ మౌనిక పాల్గొన్నారు.

కడియం తుది శ్వాస వరకు ఆంధ్రుల ఐక్యత కోసం పోరాడి, తెలుగువారి అస్థిత్వాన్ని వెలుగెత్తి చాటిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కాంగ్రెస్ పార్టీ రూరల్ కో ఆర్డినేటర్ తాడాల కొండరాజు అన్నారు. శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పిఎస్ రాజు, యాళ్ల వీరభద్రరావు, ఉలిశెట్టి సత్తిబాబు, రత్నం వెంకట్రావు, నాగిరెడ్డి వెంకటేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

చాగల్లు మండలం చంద్రవరం శాఖా గ్రంథాలయంలో శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయ అధికారి కె.సుమన్ కుమార్, నిడదవోలు సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన కృషిని విద్యార్థులకు గ్రంథ పాలకులు వివరించారు. అనంతరం విద్యార్థులచే ఆదివారం జరిగే చదవటం మాకిష్టం కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను విద్యార్థులచే చదివించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎ.రేవంత్, నాదెండ్ల వంశీ, గారపాటి చందు వి.జోసఫ్ కృష్ణ చైతన్య , జహంగీర్ పాల్గొన్నారు.

తాళ్లపూడి తెలుగు రాష్ట్ర ఏర్పాటు కోసం అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ప్రభుత్వ కార్యక్రమంగా గుర్తించడం ఎంతో ఆనందంగా ఉందని ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్ధనరావు అన్నారు. తాళ్లపూడి బస్టాండ్ సెంటర్లో వాసవి కన్యకా పరమేశ్వరి సత్రం వద్ద గల శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం పలువురు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. సంఘం నూతన అధ్యక్షుడు యండపల్లి శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనార్ధనరావుతో పాటు సంఘ సభ్యులు గోకవరపు మాణిక్యం, కంకిపాటి వినయ్, అప్పన గుప్త, గిరి, ఎవి.హనుమంతరావు, జి.రమేష్, కె.మాణిక్యం, అనంతం సాయి, కె.రాజ, కె.చిన్న, టిఎన్‌బి.గుప్త, కె.శివ, సిహెచ్.రాజా తదితరులు పాల్గొన్నారు. రెవెన్యూ కార్యాలయంలో గణాంక అధకారి జోడాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా ఘనంగా నివాళులర్పించారు.

సీతానగరం ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ సమీపంలోని పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ తనయుడు పెందుర్తి అభిరామ్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పొట్టిశ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెందుర్తి అభిరామ్ మాట్లాడుతూ త్యాగమూర్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని, వారు చూపిన బాటలో నేటి యువత నడవాలని సూచించారు. అనంతరం కమిటీ తరపున వెంకటరమణ చౌదరి, అభిరామ్ లను సన్మానించి, అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రాజమండ్రి కలెక్టరేట్‌లో శ్రీరాములకు నివాళులర్పిస్తున్న జెసి చిన్న రాముడు





తాళ్లపూడిలో పేదలకు దుస్తులు పంచుతున్న ఆర్య వైశ్య సభ్యులు



కరాటే పోటీలో విజయం సాధించిన డ్రీమ్స్ స్కూల్ విద్యార్థులు

కరాటే పోటీల్లో డ్రీమ్స్ విజయ బావుటా

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్ విద్యార్థులు విజయ బావుటా ఎగురవేశారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2024లో డ్రీమ్స్ విద్యార్థులు పది బంగారు పతకాలు, ఎనిమిది రజత పతకాలు, రెండు కాంస్య పతకాలు సాధించారు. అన్ని విభాగాల్లో డ్రీమ్స్ విద్యార్థులు ప్రతిభ చూపడంతో బెస్ట్ స్కూల్ పెర్ఫార్మెన్స్ అవార్డును కైవసం చేసుకున్నారు. కటాస్ విభాగంలో రఘుపాత్రుని రోషిణి శ్రీసాయి గౌరీ, పుల్లెల లాస్య ప్రియ, దంగేటి మధు సత్యశ్రీ, చింతా సందీప్ తేజ, పొత్తూరి సత్య మహేంద్ర వర్మ, మోర్త సుజయ్ కమల్, గల్లా ఆనంద్ రాజ్, పనస రేష్మ నాయుడు, సమనసి ఆది చర్చిత, మజ్జి వివేక్ నాయుడు ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఉండపల్లి దేవి సరయు, పనస దివిజనాయుడు, టేకుమూడి శర్వాణి, కాట్రు విజయ్ కామిరెడ్డి లిఖిత, జోగా చరణ్ తేజ, కాజులూటి దరహాస్, ఉర్రింకల మోహన్ సాయి ద్వితీయ స్థానాలను కైవసం చేసుకొని రజత పతకాలు సాధించారు. చితిరాల కార్తీక, కొల్లాటి నవదీప్ తతీయ స్థానాలను సాధించి కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. అన్ని విభాగాల్లో డ్రీమ్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపడంతో డ్రీమ్స్ స్కూల్‌కు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డును ప్రదానం చేశారు. విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ కె.జానకి రాముడును డ్రీమ్స్ విద్యాసంస్థల చైర్మన్ అంగర రమేష్ అభినందించారు.



నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గం

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కడియం

స్థానిక జెకె గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యావర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 1600 మంది సంఘం సభ్యులు పాల్గొనగా వారి సమక్షంలో రాష్ట్ర సంఘ ఎన్నికల కమిటీ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. ఈ కార్యవర్గంలో అధ్యక్షునిగా పి.గిరిప్రసాద్ వర్మ, ప్రధాన కార్యదర్శిగా కడియం గ్రామానికి చెందిన వైద్య ఉద్యోగి సిహెచ్‌ఎస్.విల్సన్ పాల్‌ను ఎన్నుకున్నారు. కడియం సిహెచ్‌సి ఉద్యోగి పి.రవికుమార్, కడియం సచివాలయ ఉద్యోగి కె.సూర్య శ్రీనివాస్ ఉపాధ్యక్షులుగా, కడియం పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, మురమండ సచివాలయ ఎఎన్‌ఎం టి.మణిశ్రీలు జాయింట్ సెక్రటరీలుగా ఎన్నికున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులందరూ ఉద్యోగ హక్కుల సాధన కోసం కృషి చేస్తూనే ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంట్ అమలులో చురుకుగా పాల్గొని ఉద్యోగ సేవలు అందించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెఆర్.సూర్యనారాయణ, ప్రధానకార్యదర్శి ఎం.రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. నూతన కార్యావర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి వాసు, ఎంఎల్‌ఎలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుల సమస్యపై స్పందించిన మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి-పెరవలి

మండలంంలో ఏడు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో ఆయా గ్రామాల రైతులు మంత్రి దుర్గేష్ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యపై ఆయన సానుకూలంగా స్పందించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందీ కలకుండా చూసే బాధ్యత తనదని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. వెంటనే రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి రైతుల వద్ద నుండి అదనంగా 1500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి అవకాశం కల్పించారు. సమస్య చెప్పిన వెంటనే స్పందించి పరిష్కరించిన మంత్రి దుర్గేష్‌కు రైతులు ధన్యవాదాలు తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

ప్రజాశక్తి-గోపాలపురం



అగ్నిప్రమాదంలో కాలిపోయిన విలువైన సామగ్రి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రూ.లక్షల విలువైన సామగ్రి దగ్ధమైన సంఘటన గోపాలపురంలోని ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గోపాలపురంలోని పెద్దగూడెంలో పాస్టర్ ఏలేటి భూషణంకు చెందిన ఇంట్లో మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారికి మంటలు ఎగసిపడ్డాయి. ప్రమాదం జరిగిన సమయంలో పాస్టర్ కుటుంబ సభ్యులు ప్రార్థనా మందిరానికి వెళ్లినట్లు తెలిపారు. ఇంట్లో ఉన్న విలువైన సామగ్రి ఎసి, ఫ్రిజ్, సెల్ ఫోన్లు, ఫ్యాన్లు టివిలు, ఇంటి వైరింగ్ సహా పలు రకాల విలువైన సామగ్రి పూర్తిగా దగ్ధం అయ్యాయని తెలిపారు. విఆర్‌ఒ శ్రీనివాస్ ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు.

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని గొల్లలగుంట గ్రామంలో ఆదివారం జగ్గంపేట ఎస్ఐ రఘునాథరావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.11 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పుష్కర కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని ఉప్పలపాడు నుంచి తాళ్లూరు వెళ్లే రహదారిలో పుష్కరకాలువలో ఒక వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. ఉప్పలపాడు గ్రామానికి చెందిన లక్కాకుల వెంకటేశ్వరరావు(63) ఈ నెల 12వ తేదీన బహిర్భూమికి వెళ్తానని బయటికి వచ్చిన వ్యక్తి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులను వాకాబు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం తాళ్లూరు నుంచి ఉప్పలపాడు వెళ్లే పుష్కరకాలువలో మృతి చెందివున్నట్లు తెలిపారు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదం

ప్రజాశక్తి - గండేపల్లి

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆదివారం సూరం పాలెం ఆదిత్య యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వార్తల సేకరణలో బిజీగా ఉంటూ వత్తిడితో జీవించే జర్నలిస్టులకు ఇలా క్రీడా పోటీలు ఉత్తేజాన్ని ఇస్తాయన్నారు. జర్నలిస్టులు నిష్పక్షపాతంగా వార్తలు రాయాలని ఆయన కోరారు. కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి మాట్లాడుతూ గెలుపు, ఓటములు కొలబద్దగా కాకుండా స్నేహపూర్వక వాతావ రణంలో ఈ పోటీలు జరగాలని ఆకాంక్షించారు. ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జర్నలిస్టులు ఎప్పుడూ విధి నిర్వహణలో బిజీగా ఉంటారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులను ఒకే వేదికగా మీదకు తీసుకొచ్చి క్రీడలు ఆడటం ఆనందంగా ఉందన్నారు. ఆదిత్య యూనివర్సిటీ ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్స్ క్రికెట్ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వడం తమ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకురాలు కృష్ణప్రియ, పెద్దాపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు మాట్లాడారు. ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఓబులం ప్రసాద్, గౌరవ అధ్యక్షులు బోళ్ళ సతీష్‌బాబు, ప్రచార కార్యదర్శి తలారి నాగలింగస్వామి, గౌరవ సలహాదారు అజయ్ ఇండియన్, అసోసియేషన్ నాయకులు తలారి రెడ్డప్ప, డిహెచ్‌వి. సాంబశివరావు, సిద్దు, లోవరాజు, సూరిబాబు, వెలుగూరి రవి, వెంకటరత్నం, రాజేంద్ర, వేణుగోపాల్, నాగవర్ధన్ రెడ్డి, సురేంద్ర, కిషోర్, తదితరులు పాల్గొన్నారు. స్టేట్ -ఎ, ఈస్ట్ గోదావరి -బి, స్టేట్ -బి, ఈస్ట్ గోదావరి -ఎ జట్ల మధ్య పోటీలు ఆసక్తికరంగా సాగాయి. విన్నర్స్ రాయల సీమ స్టేట్ బి రన్నర్స్ ఉభయగోదావరి జట్లు నిలిచాయి.

గిరిజన ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గిరిజన ప్రాంతాల్లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో కిత్తమూరిపేట, పెద్దిపాలెం గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న ఐదు కుటుంబాలకు ముదునూరి మురళీకృష్ణంరాజు చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో గిరిజనులకు అనేక సంక్షేమ పథకాలు అమలు అయ్యాయని అన్నారు. కూటమి ప్రభుత్వంలో గిరిజనులకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. రహదారుల సదుపాయం లేక గిరిజనులు అనేక ఇబ్బం దులను ఎదుర్కొంటున్నారని అన్నారు. పెద్దిపాలెం పిహెచ్‌సికి గిరిజనులు వచ్చేందుకు అవసరమైన రహ దారిని తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో దేవర లక్ష్మణ్, లోండ బాబులు, మేకా చంటి బాబు, విత్తనాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దేవర్ష ఆసుపత్రి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గత కొన్ని సంవత్సరాలుగా ప్రత్తిపాడులో దేవర్ష ఆసుపత్రి అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంఎల్ఎలు జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ అన్నారు. ఆదివారం దేవర్ష మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవర్ష ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అంజినాయక్, డాక్టర్ విజయ పట్టణాల్లో కార్పొరేట్ ఆసుపత్రిలో ఏవిధంగా సదుపాయాలు ఉన్నాయో అన్ని సదుపాయాలతో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రత్తిపాడులో ప్రారంభించడం అభినందనీ యమన్నారు. చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల వాసులకు దూర ప్రాంతాలు వెళ్ళకుండా దగ్గరలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దేవర్ష ఆస్పత్రి అధినేతలు డాక్టర్ అంజి నాయక్, డాక్టర్ విజయ చుట్టుపక్కల గ్రామీణ ప్రాంత వాసులకు అందిస్తున్న వైద్య సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అతిథులను ఆసుపత్రి యాజమాన్యం ప్రతినిధులు జ్ఞాపకలను అందజేశారు. కార్యక్రమంలో కొమ్ముల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల బాబుకి అభినందన

ప్రజాశక్తి - మండపేట

కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) ఛైర్మన్‌గా నియమితులైన తుమ్మల రామస్వామి (బాబు)ని ఆదివారం మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడలో జరిగిన ఆయన ప్రమాణ స్వీకార మహోత్సవంలో లీలాకృష్ణ పాల్గొన్నారు. ఈ సం దర్భంగా తుమ్మల బాబుకు అభినందనలు తెలిపారు.

రైతు సంక్షేమంలో సాగునీటి సంఘాలు కీలకం

ప్రజాశక్తి - సీతానగరం

రైతాంగం అభివృద్ధి చెందడంలో సాగునీటి సంఘాలు కీలక పాత్ర పోషించాలని ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ అన్నారు. శనివారం జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని నీటి సంఘాలూ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల ఎంఎల్ఎ బలరామ కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నీటి సంఘాల కార్యవర్గాలకు ఎంఎల్ఎ అభినందనలు తెలపడంతో పాటు, పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రజలకు, రైతాంగానికి, ఏ చిన్న కష్టం వచ్చినా సాయం అందించడానికి ముందు ఉండాలన్నారు. రైతుల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. సబ్సిడీ రుణాలు, ధాన్యం కొనుగోలుకు సంబంధించిన డబ్బులను త్వరితగతిన అందించి, సాగునీటికి ఆటంకాలు లేకుండా ప్రభుత్వం అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తోందన్నారు. ప్రస్తుతం నీటి సంఘాలు కూడా కొలువుదీరడంతో రైతులకు మరిన్ని సేవలు అందడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి రైతు సంఘం ఆ పరిధిలోని ఆయకట్టు రైతులకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువచ్చి, త్వరితగతిన పరిష్కారం అయ్యేలా కృషి చేద్దామన్నారు. రైతులు పడుతున్న ఇబ్బందులు, కష్టాలు ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కూడా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. దానికోసం సమిష్టిగా కృషి చేద్దామని ఎంఎల్ఎ సూచించారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో ఇప్పటికే ఎత్తిపోతల పథకాలు ఉన్నప్పటికీ కొన్నిచోట్ల ఇబ్బందులు నెలకొన్నాయన్నారు. వాటిని పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

సీతానగరం మండలంలో పుష్కర తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకాలకు సంబంధించి ఏకగ్రీవంగా ఎన్నికైన సాగునీటి సంఘాల కార్యవర్గాలను ఎంఎల్ఎ బలరామకృష్ణ అభినందించారు. తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ ద్వారా సాగయ్యే ఆయకట్టుకు ఎటువంటి ఇబ్బందులూ రాకుండా.. నీటి సంఘం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ఇప్పటికే తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ అభివద్ధి విషయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. దానిని మరింతగా ఆధునీకరించి, రైతాంగానికి సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు. నీటి సంఘంగా ఇకపై దానికి సంబంధించి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే దాన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు. రైతాంగ సమస్యలు, సాగునీటి పథకాలను అసెంబ్లీ దృష్టికి తీసుకు వెళ్లడంతో పాటు రైతాంగ సమస్యలపై ఆయా శాఖల మంత్రుల దృష్టికి కూడా తీసుకువెళ్లినట్టు తెలిపారు. ఇప్పటికే కొన్ని పరిష్కారం కాక మరి కొన్ని త్వరలోనే పరిష్కరించబోతున్నట్టు ఎంఎల్ఎ స్పష్టం చేశారు. ప్రస్తుతం రైతు సంఘాలు కూడా అందుబాటులోకి రావడంతో నియోజకవర్గంలో రైతాంగానికి సమస్యలు లేకుండా చేయడమే ప్రధాన లక్ష్యంగా ముందడుగు వేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయా నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను, కార్యవర్గాన్ని అభినందించారు. ఏకగ్రీవం కావడానికి సహకరించిన జనసేన, టిడిపి, బిజెపి నేతలు శ్రేణులకు ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.



నీటి సంఘాల నాయకులను అభినందిస్తున్న ఎంఎల్ఎ

దొంగ నోట్ల కేసులో నిందితుని తప్పించిందెవరు..?

పోలీసు వర్గాల్లో మొదలైన చర్చ
ముమ్మరంగా గాలింపు చర్యలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

దొంగనోట్ల కేసులో నిందితుడిని అరెస్టు చేసి తీసుకెళుతున్న శ్రీకాకుళం పోలీసులపై దాడి చేసి నిందితుడిని తీసుకెళ్లిందెవరు అనే ప్రశ్న సాధారణ ప్రజలతో పాటు పోలీసుల వర్గాల్లోనూ తలెత్తుతోంది. పోలీసులపై దాడి చేసి సినీ ఫక్కీలో నిందితుడిని తీసుకెళ్లిన ఘటనతో ఆ శాఖ ఉలిక్కి పడింది. ఈ నేపథ్యంలో నిందితుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. హైవేలు, ప్రధాన రహదారులను జల్లెడ పడుతున్నారు. శ్రీకాకుళం ప్రధాన కేంద్రంగా జరుగుతున్న ఈ దందాలో ముఖ్య నిందితునిగా భావిస్తున్న రాపాక ప్రభాకర్ అలియాస్ ప్రతాప్ రెడ్డిని తప్పించెదవరు శ్రీకాకుళం నుంచి వచ్చారా లేక భీమవరం నుంచి ముందే వచ్చారా అనే కోణంలోనూ విచారణ జరుగుతోంది. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలంలో దొంగనోట్ల కేసులో అక్కడ కొంత మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు రాపాక ప్రభాకర్ అలియాస్ ప్రతాప్‌రెడ్డి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఉన్నాడని తెలిసి లావేరు ఎస్ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లు అక్కడకు వెళ్లారు. నిందితుడిని అదుపులోకి తీసకున్నారు. ఈ కేసులో కృష్ణమూర్తి అనే మరో వ్యక్తి నగరంలో ఉన్నాడని తెలిసి భీమవరం నుంచి అదే రోజు రాత్రికి రాజమహేంద్రవరం వచ్చారు. అయితే అతడి ఆచూకీ లభించలేదు. దీంతో శ్రీకాకుళం పోలీసులు ఇక్కడి నుంచి అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో తిరిగి వెళ్లిపోతుండగా విఎల్‌పురం సమీపంలో కారును సుమారు 20 మందికి పైగా అడ్డగించి, పోలీసులపై దాడి చేసి నిందితుడిని తమ వెంట తీసుకుని వెళ్లి పోయారు.



నీటి సంఘాల నాయకులను అభినందిస్తున్న ఎంఎల్ఎ

వీరకృష్ణ జ్ఞాపకార్థం ఫ్రీజర్ అందజేత

ప్రజాశక్తి-గోపాలపురం

కొండేపాటి వీరకృష్ణ జ్ఞాపకార్థం ఆయన మనవలు ఫ్రీజర్ బాక్స్‌ను చిట్యాల గ్రామానికి అందించడం అభినందనీయమని మానవత స్వచ్ఛంద సంస్థ మండల అధ్యక్షులు పప్పు సత్య కష్ణ, మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు అన్నారు. చిట్యాల గ్రామానికి సేవలందించడం సుమారు రూ.80 వేల విలువైన నూతన ఫ్రీజర్ బాక్స్‌ను కొండేపాటి రత్నాజీ చౌదరి దంపతులు మానవత సభ్యులకు అందజేశారు. అనంతరం రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ మనుషులు ఉన్నంతకాలం మానవత్వం ఉండాలని, మానవత సేవలు కొనియాడదగినవని అన్నారు. శాంతి రథాలు, ఫ్రీజర్లు, వాటర్ ట్యాంకులు, పేద విద్యార్థులకు ప్రతిభా పురస్కార్ అవార్డ్స్, మెడికల్ క్యాంపులు, బ్లడ్ క్యాంపులు, యాక్సిడెంట్లు గుర్తై ఆపదలో ఉన్న వారికి సాయం చేయడం ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు గోపాలపురం మండలంలో మానవత సంస్థ సభ్యులు చేస్తున్నారని, తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ మానవతకి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కుక్కల కీర్తి కుమార్, ట్రెజరర్ గెడ జోగేంద్ర ప్రసాద్, గద్దె శేషగిరిరావు, నందిన సుబ్రహ్మణ్యం, ఇసి మెంబర్స్ ఎలిపే నరేంద్ర, జుత్తిగ సూర్యచంద్ర, మద్దిపాటి గంగరాజు, సిఆర్‌పి కొయ్య నాగరాజు మానవత సభ్యులు పాల్గొన్నారు.

కెఎఫ్‌సిఎల్ చెక్‌పోస్టులో జెసి తనిఖీలు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ సీ పోర్టు లిమిటెడ్ 2వ గేట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద ఆదివారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా కెఎఫ్‌సిఎల్ పోర్టులో ఉన్న ఉషశ్రీ ట్రేడర్స్‌కు చెందిన స్టఫ్డ్ రైస్ కంటైనర్ల నుంచి చెక్ పోస్ట్ టీమ్‌తో నమూనాలు సేకరించి పరీక్షలు చేయించారు. ఈ నమూనాల పరీక్షలలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ లేనందున కంటైనర్లలోని బియ్యం పిడిఎస్ బియ్యం కావని నిర్ధారించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల భద్రత నిమిత్తం ప్రతినెలా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి అక్రమ ఎగమతులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తనిఖీలు పటిష్టంగా నిర్వహించేందుకు ఇటీవల నూతనంగా మరోక చెక్ పోస్టును కెఎఫ్‌సిఎల్ వద్ద ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ చెక్ పోస్ట్ ల వద్ద సుశిక్షుతులైన సిబ్బంది తనిఖీలు నిర్వహించిన అనంతరం వాహనాలకు గేట్ పాస్ ద్వారా అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. చెక్ పోస్ట్ వద్ద 24 గంటలు మూడు షిఫ్ట్ లలో రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలకు చెందిన అధికారులతో కూడిన బృందం తనిఖీలు నిర్వహించి నమూనాలు సేకరించడం జరుగుతుందన్నారు.

కంటి వైద్య శిబిరంలో ఉచిత సేవలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక సాయి శంకర్ నేత్రాలయ ఆవరణలో ఏలేశ్వరం లయన్స్ క్లబ్, కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 200 మంది రోగులకు సేవలు అందిం చారు. ఈ శిబిరాన్ని ప్రకృతి పరిరక్షణ సంఘం అధ్యక్షులు డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు ప్రారంభించారు. ఈ శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్యులు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు, కిరణ్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అవని, డాక్టర్ వెంకట అనూష వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు కళ్ళజోళ్ళు అందజేశారు. వీరిలో 30 మందికి ఐఒఎల్ ఆపరేషన్ నిమిత్తం కాకినాడ కిరణ్ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు జ్యోతుల నాగ సత్య శ్రీనివాస్, అలమండ దుర్గాప్రసాద్, కప్పల నాగభూషణం, గొల్లపూడి గణేష్, జామి సూర్యప్రకాష్, తాండూరి రాము, తాళ్లూరి గొల్లాజీరావు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఇరిగేషన్ ఈస్ట్రన్ డివిజన్‌లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఇవ్వాల్సిన 11 నెలల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పేర్కొంది. వికాస్ ద్వారా ఔట్‌సోర్సింగ్‌లో చేరి రూ.10,500లకు 11 ఏళ్ల నుంచి 200 మంది పని చేస్తున్నారని అన్నారు. వారిని ప్రభుత్వ సర్వీసులోకి చేర్చేందుకు తగిన క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే వారికి చెల్లించాల్సిన 11నెలల బకాయి వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న ఇండియన్ గ్రాండ్ మాస్టర్ గుకేష్ చిత్రం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ గీసిన ఇండియన్ గ్రాండ్ మాస్టర్ డి.గుకేష్ చిత్రం అందరినీ ఆకట్టుకుంది. ఈ మేరకు ఆదివారం ఆయన గుకేష్ చిత్రపటాన్ని వాటర్ కలర్స్ ఉపయోగించి వేశారు. తెలుగు తేజం దొమ్మరాజు గుకేష్ కేవలం 18 ఏళ్లకే ప్రపంచంలో అత్యంత పిన్న వయస్సు లో ప్రపంచ చెస్ ఛాంపియన్ గా అవతరించి సింగపూర్ లో చరిత్ర సృష్టించి ఇండియన్ గ్రాండ్ మాస్టర్ గా నిలిచారు. రాబోయే దశాబ్దాలలో మరెన్నో విజయాలు సాధించి భారతదేశ ఖ్యాతిని మరింత పెంచాలని, అందరి ప్రశంసలు పొందాలని ఇండియన్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్ కు నా చిత్రాభినందన అంటున్నారు. ఈ చిత్రం అందరిని ఆకట్టుకుంది

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం

ప్రజాశక్తి - కాకినాడ

నియోజక వర్గం స్థాయిలో నేడు నేడు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని పిఠాపురంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పిఠాపురంలో జరిగే సమావేశంలో తనతోపాటు, వివిధ శాఖలకు చెందిన జిల్లా దిగువ స్థాయి అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొంటారని అన్నారు. ఉదయం 9.30 నిమిషాలకు పిఠాపురం రథాలు పేట అంబే ద్కర్ కమ్యునిటి హాలులో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లా స్థాయిలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో, మండల స్థాయిలో జరిగే ఈ కార్యక్రమం ఉదయం10 గంటల నుంచి 1 గంట వరకు యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

గుంటూరు 'మహా గర్జన'కు తరలిన నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎస్‌సి వర్గీకరణను వ్యతిరేకిస్తూ గుంటూరు జిల్లా నల్లపాడులో ఆదివారం నిర్వహించిన మాలల మహా గర్జనకు దళిత నాయకులు పెద్దఎత్తున వాహనాల్లో తరలివెళ్లారు.

మామిడి కుదురు: సుప్రీం కోర్టు రాజ్యాంగ వ్యతిరేక ఎస్‌సి వర్గీకరణ, క్రిమిలేయర్, తీర్పులను వ్యతిరేకిస్తూ గుంటూరు జిల్లా నల్లపాడులో నిర్వహిస్తున్న మాలల మహా గర్జన సభ బయలుదేరి వెళ్లే బస్సులను మామిడికుదురులో గొల్లపల్లి సూర్యారావు, డి సి సి అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భూపతి వెంకటపతి, నల్లి శ్రీనివాస్, బొంతు మణిరాజు, కలిగిత పల్లంరాజు, నెల్లి దుర్గాప్రసాద్, గేడ్డం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం:** జిల్లాలో అమలాపురం నుంచి గుంటూరులోని నల్లపాడులో మాలల మహా గర్జనకు బస్సులు, కార్లలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో చింతా రామకష్ణ. జల్లి శ్రీను, కుంచె బాబులు, నాతి శ్రీనివాస్, ములపర్తి వెంకటేశ్వరరావు, కుంచే సిద్ధార్థ ప్రసాద్, మాకే వెంకటేశ్వరరావు తదితరులు వెళ్లారు. **ముమ్మిడివరం:** ఎస్‌సి వర్గీకరణను వ్యతిరేకిస్తూ గుంటూరులో జరిగే మాలల మహా గర్జన సభకు మాలమహానాడు నాయకులు, ఎస్‌సి ఉద్యోగులు, యువత అధిక సంఖ్యలో తరలివెళ్లారు. గర్జన సభకు మండల మాల మహానాడు, ఎస్‌సి ఉద్యోగుల సంఘం నాయకుల అద్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సులు, కార్ల లో మండలంలోని 16 గ్రామ పంచాయతీలు, నగర పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి తరలి వెళ్లారు. తొలుత నగర పంచాయతీ చైర్మన్ కమిడీ ప్రవీణ్ కుమార్ బుద్ధ పార్కు ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం గుంటూరు వెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు కార్యకర్తలు ఎస్‌సి వర్గీకరణ వద్దు, ఐక్యతే ముద్దు అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల మాలమహానాడు నాయకుడు, ఉద్యోగుల సంఘం నాయకులు మట్టా శ్రీనివాసరావు జనిపల్లి బాలకృష్ణ, ఎం.ఆశీర్వాదం, జె.సత్యనారాయణ, జగపతి ఏడుకొండలు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** మండలంలోని నల్లూరు, పడమర ఖండ్రిక గ్రామాల నుంచి చలో గుంటూరు మాలల మహా గర్జన సభ కార్యక్రమానికి దళిత సంఘం నాయకులు, యూత్ సభ్యులు, భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి విలేకరులతో మాట్లాడుతూ మాలలు ఐక్యత పరిష్కారానికై గుంటూరులో జరిగే మాలల గర్జన సభకు తరలి వెళుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాకా శ్రీను, నేల సూర్యకుమార్, కనికెళ్ళ శ్రీను, సాదే శ్రీను, వట్లూరి సుబ్బారావు, మద్దా రమేష్, మొసలి నాగభూషణం, మోర్త శ్రీను తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** ఎస్ సి వర్గీకరణను వ్యతిరేకిస్తూ గుంటూరు నల్లపాడు లో తలపెట్టిన మహాగర్జన సభకు మండలం నుంచి మాలలు బస్సులు, కార్లు ఇతర వాహనాలపై తరలి వెళ్లారు. మండల మాల మహానాడు నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, గెడ్డం సురేష్ బాబు, పొలమూరి మోహన్‌బాబు, కొంకి వెంకటబాబ్జి, కుంచే బాబులు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, రేవు తిరుపతిరావు, అయితాబత్తుల అజయ్ సింగ్ తదితరులు మహాగర్జనకు వెళ్లారు.



మామిడికుదురు నుంచి మహాగర్జన సభకు వెళుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి, డిసిసి అధ్యక్షుడు కొండేటి

ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

ఉపాధ్యాయులపై యాప్ ల భారం తగ్గించాలని రాష్ట్ర అధ్యక్షులు మిట్టా కృష్ణయ్య అన్నారు. ఆదివారం మామిడికుదురు హైస్కూల్ ప్రాంగణంలో పిఆర్‌టియు అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యా సదస్సు, కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు దీపాటి సురేష్‌బాబు అధ్య క్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఐఆర్30 శాతం ప్రకటించాలని, హిందీ, ఇంగ్లిష్ సిలబస్ తగ్గించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ జిల్లా ఉప విద్యాశాఖ అధికారి మైలవర్ అప్పు రవీంద్రనాథ్ విద్యా సదస్సు లో ప్రస్తుత విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్ల అంశం పై ప్రసం గించారు. అనంతరం పిఆర్‌టియు రిటైర్డ్ ఉపాధ్యా యులకు సన్మానం చేశారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నరాల కృష్ణ కుమార్, రాష్ట్ర కార్యదర్శి కంకటాల చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ పంగంబ్రహ్మాజీరావు, మామిడి కుదురు మండల శాఖ అధ్యక్షులు యాల పల్లంరాజు, మండల కార్యదర్శి చింతా రమేష్, మండల ఆర్థిక కార్యదర్శి కడలి వెంకట దుర్గాప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి 2. మోకా వెంకన్నబాబు, హై స్కూల్ హెచ్‌ఎం సిహెచ్ నిరంజని తదితరులు పాల్గొన్నారు.



పిఆర్‌టియు కౌన్సిల్ సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య

700 మందికి చీరలు, దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

వికలాంగులు, వృద్ధులు, మహిళలకు దుప్పట్లు, చీరలను సాయి ట్రస్ట్ విశాఖపట్నం వారు పంపిణీ చేశారు. ట్రస్ట్ 15వ వార్షికోత్సవం సందర్భంగా సత్య సాయి ట్రస్ట్ ఫర్ సోషల్ వెల్ఫేర్ విశాఖపట్నంకు చెందిన శివకోటి మధు సూధనరావు ఆధ్వర్యంలో ద్రాక్షారామంలో ఆదివారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. భీమేశ్వర స్వామి అతిథి గహం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో 700 మంది వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు సుమారు రూ.3లక్షలు విలువైన చీరలు, దుప్పట్లు అందజేశారు. వారికి భోజ నం, ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మధు సూదనరావు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం డిసెంబర్ నెలలో తమ బృందం 50మంది సభ్యులతో కలిసి విశాఖ నుంచి ద్రాక్షారామ వచ్చి పేదవారికి తాము సేవ చేస్తున్నామని తెలిపారు. మా సంస్థ వారు విశాఖ పట్నంలో కెజిహెచ్ వద్ద ప్రతి రోజూ 500 మందికి ఉచితంగా భోజనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. నేటికి 15 సంవత్సరాలు నుంచి నిరంతరంగా మా బృందం ద్రాక్షారామ వచ్చి పేద వారికి ఉచితంగా దుస్తులు, భోజనం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాట్ల అప్పారావు, దాడి భాస్కర్, పి.శ్రీనివాస్, జె.చంద్రశేఖర్, ఐ.రవికిరణ్, బి.శ్రీకాంత్, ఎస్‌విఆర్ రాజు, మైనార్టీ బిసి సంఘ నాయకులు యాట్ల నాగేశ్వరరావు, రోజా రాణి, తదితరులు పాల్గొన్నారు.



విశాఖ సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

జీడిపిక్కల కార్మికులకు ప్రజా సంఘాల మద్దతు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

చిన్నింపేట జీడి పిక్కల ఫ్యాక్టరీని తెరిపించాలని ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులకు వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆది వారం మద్దతు ప్రకటించారు. ఫ్యాక్టరీ వద్ద ధర్నా నిర్వహి స్తున్న కార్మికులకు వద్దకు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చంద్ర మౌళి పద్మ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తమ కార్యకర్తలతో చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి పిక్కల ఫ్యాక్టరీ కార్మికులు గత నెల రోజులుగా పోరాడుతున్న ప్రభుత్వం కనీసం పట్టించుకోక పోవడం దారుణమ న్నారు. తక్షణమే ఫ్యాక్టరీ తెరిపిం చి 409 మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున స్కీం వర్కర్లు కార్మికులకు మద్దతుగా రోడ్డుపై కి వస్తారని హెచ్చరించారు. యాజమాన్యం తమ స్వార్థ ప్రయోజ నాల కోసం ఫ్యాక్టరీని మూసివేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పార్వతి, సిహెచ్.సత్య, కార్మిక నాయకులు ఎ వీరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, ఆది, కృష్ణారావు, శివ దుర్గాప్రసాద్, రామదుర్గ, జయలక్ష్మి, అన్నపూర్ణ, శివలక్ష్మి, దేవి, చంటి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - శంఖవరం

దేవస్థానంలోని అన్ని విభాగాలకు చెందిన ఉద్యోగులు విధులు పట్ల అలసత్వం వహిస్తే ఖఠిన చర్యలు తీసుకుంటానని అన్నవరం దేవస్థానం కార్య నిర్వహణఅధికారి వీర్ల సుబ్బారావు హెచ్చరించారు. ఆదివారం తన కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్ని విభాగాలు ఉన్నాయి? ఏ విభాగాల్లో పాలన, అభివృద్ధి, ఆదాయం అంశాలపై ఆయన ఆరా తీశారు. ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న నిర్మాణాలకు సంబంధించిన నాణ్యత ప్రమాణాలపై ఆరా తీశారు. లీజులు విభాగంలో ల్యాండ్స్, బకాయిల గురించి అడిగి తెలుసు కున్నారు. అవినీతి అక్రమాలకు ఏ ఉద్యోగి పాల్పడిన క్రమశిక్షణ చర్యలు కఠినంగా ఉంటాయని, దానిని దృష్టిలో పెట్టుకుని ఉద్యోగులు పనిచేయాలని ఆయన హెచ్చరిం చారు. ఈ సమావేశంలో డిసి చంద్రశేఖర్, ఎసి రామ్మోహనరావు, ఎఇలు, పర్యవేక్షణ అధికారులు, పిఆర్ఓ కొండల్ రావు పాల్గొన్నారు.

7వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 7వ రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సమ్మె శిబిరంలో యూనియన్ అధ్య క్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంజనీ రింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, టెక్నికల్ ఉద్యోగులకు రూ.29,200, నాన్ టెక్నికల్ ఉద్యోగులకు రూ.24,500 వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కార్మికుల కుటుంబానికి రూ.10 లక్షలు, వైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాల న్నారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.